క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి

మంగళగిరి టౌన్: వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంగళగిరి రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద శనివారం రాత్రి వాహనాలను సిబ్బందితో కలసి తనిఖీలు చేశారు. ట్రిపుల్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, మైనర్ డ్రైవింగ్‌తో పాటు నిబంధనలను ఉల్లంఘించిన వాహనచోదకులపై16 కేసులు నమోదు చేసి రూ. 16,810 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక ఉన్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు.

చెక్కుల పంపిణీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల కోసం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం టీడీపీ నాయకులు అందజేశారు. మొత్తం రూ.1,51,708 విలువైన చెక్కులను ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, ఓలిటి రాము, ఇట్టా భాస్కర్, షేక్ చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డివైడర్లకు రేడియం స్టిక్కర్లు



ఫిరంగిపురం: మండల కేంద్రంలో సొలస బస్టాండు సెంటర్, పశువైద్యశాల సెంటర్లలో డివైడర్లకు సీఐ శివరామకృష్ణ ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లను శనివారం అంటించారు. ఈ సందర్భంగా సీఐ శివరామకృష్ణ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు, వాహన పత్రాలు వెంట ఉండేలా చూసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ పఠాన్ జాన్‌ఖాన్, సిబ్బంది ఉన్నారు.

మేకా సుబ్బారెడ్డికి నివాళి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో నివసించే వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మేకా సుబ్బారెడ్డి (57) శనివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్), పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుబ్బారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని డీవీఆర్ హామీ ఇచ్చారు.

మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి



తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. బ్రహ్మానందపురంలో శనివారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షలను నాయకులు సాంబశివరావు, గురవయ్యలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు గత 312 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మొలకల శారద, ఇమాంబి, శారమ్మ, రిబ్కా, నాగమల్లీశ్వరి, హేమంత్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మేడికొండూరు: పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కృష్ణా జిల్లా పామర్రు మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన పాదాలు పెద్దిరాజు (46) తన కుటుంబంతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం మేడికొండూరు మండలంలోని విశదల గ్రామానికి వలస వచ్చారు. భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం రావడంతో అతను మనస్తాపానికి గురయ్యాడు. పెద్దిరాజు రెండు రోజుల క్రితం పురుగులు మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు అతని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్యా పిల్లలు ఉన్నారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి



వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల సోమిరెడ్డి తదితరులు



పోస్టరును ఆవిష్కరిస్తున్న తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, నేతలు

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం మానుకోకపోతే ఉద్యమం తప్పదని వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని దొంతిరెడ్డి అంజిరెడ్డి భవన్‌లో కోటి సంతకాల పోస్టర్‌ను పార్టీ నేతలు, అనుబంధ సంస్థల అధ్యక్ష, కార్యదర్శులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 45 రోజులకు పైగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టామని, దానిలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలోని పేదలకు, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి 17 కాలేజీల నిర్మాణానికి నాంది పలికి, 5 మెడికల్ కాలేజీలను పూర్తి చేశారన్నారు వాటిలో వైద్య సదుపాయాలు కూడా అందుతున్నాయన్నారు. మరో మూడు కాలేజీలు తుది దశకు చేరుకున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ధనార్జనతో ఆ కాలేజీలను మేము పూర్తి చేయలేము, ప్రైవేటీకరణ చేస్తామంటూ ప్రకటించిందని తెలిపారు. అలా చేస్తే రాష్ట్రంలో పేదలు వైద్యానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు ఉచిత వైద్యం అందించాలంటే వైద్య కళాశాలలను పూర్తిచేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ, మండల నాయకులు

పేదలపై కూటమి కుట్రలు

తాడికొండ: పేదవాడికి వైద్యం అందకుండా చేయడమే లక్ష్యంగా కూటమి సర్కారు కుట్రలు చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తూ పీపీపీ విధానాన్ని ప్రవేశపెట్టి కుట్రలు చేస్తున్న కూటమి సర్కారు విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో తాడికొండ మండల పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోలారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో 17 కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. వీటిలో ఏడు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి పూర్తయితే పేదలకు వైద్య విద్యను అందించడంతో పాటు ఉచిత వైద్య సేవలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. పేదలకు అన్యాయం చేయడానికి వీటిని ప్రైవేటీకరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముప్పాళ్ళ మనోహర్, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు దాసరి రాజు, వివిధ విభాగాల అధ్యక్షులు బొంతా శ్రీకాంత్, షేక్ అబ్బాస్, బాబావలి, బాకి వెంకటస్వామి, షేక్ అజీస్, గుంటి రఘువరన్, మల్లంపాటి రాఘవరెడ్డి, మల్లంపాటి చంద్రశేఖర్ రెడ్డి, షేక్ బాజీ, షేక్ సలీమ్, వలపర్ల కల్పన, సాంబిరెడ్డి, సాధిక్, గోల్డ్ బాబు పాల్గొన్నారు.

‘డొక్కా’ వ్యాఖ్యలు అభ్యంతరకరం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు సలోమాన్

ఫిరంగిపురం: మెడికల్ కళాశాలల అంశంలో డొక్కా మాణిక్యవరప్రసాద్ వ్యాఖ్యలు అభ్యంతరకరమని వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి.సలోమాన్ చెప్పారు. బడుగు, బలహీన వర్గాలు, పేదపిల్లలు ఉన్నత విద్యాభ్యాసం చేయకూడదా అని ప్రశ్నించారు. మండలకేంద్రం క్రీస్తునగర్‌లోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎల్లో మీడియాలో నిర్వహించిన డిబేట్‌లో మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మెడికల్ కళాశాలల గురించి మాట్లాడుతూ ఎంబీబీఎస్ చదవడం ఒక ఫ్యాషన్ అయింది, పేదపిల్లలు చదువుకోవడం అనవసరం అని మాట్లాడటాన్ని ఖండించారు. ఇప్పటికే మెడికల్ కళాశాలలు ఎక్కువయ్యాయి అంటూ మాణిక్యవరప్రసాద్ మాట్లాడటం మంచి పద్ధతికాదని హితవు పలికారు. పేదల వైద్యకోసం గత ప్రభుత్వం హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు మెడికల్ కళాశాలలకు అనుమతులిచ్చారన్నారు. వాటితో పేద, బడుగు, బలహీన వర్గాలకు వైద్యసేవలు అందుతాయని చెప్పారు. వాటిని కాదని కూటమి ప్రభుత్వం కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని సమర్థించుకుంటున్నారన్నారు. డొక్కా మాణిక్యవరప్రసాద్ మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని తెలిపారు. ఊసరవెల్లి రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరని, అటువంటి మాటలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఇజ్రాయిల్, సయ్యద్ సాహెబ్, చేవూరి రామమోహన్‌రెడ్డి, అమానుల్లా, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మంగళగిరి టౌన్: ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించామని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివీస్ కంపెనీ తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. మొదట రాత పరీక్ష, అనంతరం ముఖాముఖి ఇంటర్వ్యూలు చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వారం రోజుల్లో నియామక పత్రాలు అందించనున్నట్లు దివీస్ కంపెనీ ప్రతినిధి డి. శ్రీహరి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ సిస్టర్ బి. నిర్మల జ్యోతి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి, సమన్వయకర్తలు జోజిబాయి, భార్గవ్ గోపి, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సంఘటితంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసకుమారి

మంగళగిరి టౌన్: మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, దీనికి వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి. శ్రీనివాసకుమారి పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని ఐద్వా కార్యాలయంలో శనివారం గుంటూరు జిల్లా 12వ మహాసభను నిర్వహించారు. ఐద్వా జెండాను ఆవిష్కరించిన అనంతరం శ్రీనివాసకుమారి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై మహిళలు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి పురుషులు బానిసలు అవుతున్నారని, దీనికి ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. ప్రభుత్వ దురాగతాలపై అందరూ కలసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పని గంటలను, దినాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మైక్రో ఫైనాన్స్ వేధింపులను ప్రభుత్వం అరికట్టాలన్నారు. విద్య, వైద్యం, ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలుత మహిళా ఉద్యమంలో అమరులైన మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, మానికొండ సూర్యావతి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రామిక జిల్లా మహిళా కన్వీనర్ అరుణ, ఐద్వా జిల్లా నాయకురాలు సుధా కిరణ్, జిల్లా మాజీ కార్యదర్శి ప్రమీల, మంగళగిరి రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సంధ్య, విజయలక్ష్మి, సభ్యులు పద్మ, గిరిజ, కల్యాణి పాల్గొన్నారు.

జిల్లా ఐద్వా కమిటీ ఎంపిక

మహాసభలో గుంటూరు జిల్లా ఐద్వా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె. పద్మ, కార్యదర్శిగా అరుణ, సహాయ కార్యదర్శులుగా గిరిజ, సుమ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసకుమారితో పాటు 15 మందితో కమిటీ ఎన్నికైంది.

విద్యార్థులకు చేతిరాతలో శిక్షణ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతిరాత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మాట్లాడుతూ కాలిగ్రాఫర్స్ షేక్ జున్ను, ముజుర్ బుర్హాన్‌లు ప్రధాన శిక్షకులుగా విద్యార్థులకు అద్భుతమైన హ్యాండ్ రైటింగ్ పద్ధతులను, అక్షరాల సౌందర్యాన్ని వివరంగా బోధించారని తెలిపారు. చేతిరాత వ్యక్తిత్వానికి అద్దం పడుతుందని, అందమైన రాత, క్రమశిక్షణతో కూడిన ఆలోచనలకు ప్రతీక అన్నారు. ప్రతి విద్యార్థి రోజులో కొంత సమయాన్ని రాత సాధనకు కేటాయించాలని సూచించారు. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థుల వరకు సుమారు 70 మందికి చక్కటి చేతిరాత సాధన చేయించామని తెలిపారు. శిక్షణా సమయంలో లెటర్ స్పేసింగ్, లైన్ డిసిప్లిన్, స్ట్రోక్ ప్రాక్టీస్, సృజనాత్మక అక్షర రూపకల్పన వంటి అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శను ఇచ్చామని పేర్కొన్నారు. అనంతరం కాలిగ్రాఫర్స్ షేక్ జున్ను, ముజుర్ బుర్హాన్‌లను ఘనంగా సత్కరించారు. చేతిరాతలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజిక్స్ లెక్చరర్ ఎం. రామచంద్రారెడ్డి, హిందీ టీచర్ అనీల సుల్తాన, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల విస్తృత సమావేశం



మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తాడేపల్లి రూరల్: పాఠశాలల్లో శానిటేషన్ కార్మికుల సమావేశాన్ని సీఐటీయూ ఆధ్వర్యాన శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు ఇస్తున్న వేతనాలు కేవలం రూ.6 వేలు మాత్రమేనని, అదీ రెండు మూడు నెలలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, ప్రతి నెలా జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నెల 15న సంబంధిత అధికారులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అర్జీలు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ తాడేపల్లి మండల అధ్యక్షురాలిగా మరియమ్మ, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరి మేరీ ప్రమీల, కోశాధికారిగా డి.ప్రసన్న మరో 9 మందిని కమిటీగా ఎన్నుకున్నారు.

భూ సమీకరణపై స్పష్టతనివ్వండి

తాడికొండ: అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం తలపెట్టిన రెండో విడత భూ సమీకరణపై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాజధాని పేదలకు న్యాయం చేయాలని కోరుతూ నిడుముక్కల గ్రామంలో జంజనం కోటేశ్వరరావు చేస్తున్న దీక్ష శనివారానికి 104వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణ విషయంలో పొంతనలేని ప్రకటనలు చేస్తోందన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పలువురు రైతులు, మహిళలు, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల కోసం పీఎం ధన్ ధాన్య్ కృషి

దుగ్గిరాల: రైతుల కోసం పీఎం ధన్ ధాన్య్ కృషి యోజనను నిర్వహిస్తున్నట్లు దుగ్గిరాల పసుపుయార్డు చైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి తెలిపారు. శనివారం మండలకేంద్రం దుగ్గిరాల పసుపు యార్డులో యార్డు ఉన్నత శ్రేణి అధికారి జె.వి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ధన్–ధాన్య కృషి యోజన ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారు. కార్యక్రమంలో యార్డు రవికిషోర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

చిత్రపు శ్రీదేవి W/o: బాల, D.No:10-125, మాదిగపల్లె, చిలువూరు గ్రామం, దుగ్గిరాల (మం) గుంటూరు జిల్లాలో నివాసం ఉంటున్నాను. ఇదే గ్రామంలో నాకు సంబంధించిన 487/3 సర్వే నెం. ఉన్న 242 గజాల ఇంటి స్థలము డాక్యుమెంట్ (నంబర్ 194/2014) చిలువూరు నుండి దుగ్గిరాలకు వెళ్తుండగా మార్గమధ్యలో పోయింది. ఎంత వెతికినా దొరకలేదు. కావున తెలియజేయడమైనది. ✆ 78427 32064

చైతన్య తరగతులను జయప్రదం చేయండి



కరపత్రాలను అందజేస్తున్న ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: నెల్లూరు జిల్లాలో నవంబర్ 1,2 తేదీల్లో జరగనున్న రజకవృత్తిదారుల చైతన్య తరగతులను జయప్రదం చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపం వద్ద వృత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని, రజక అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ద్వారా బడ్జెట్‌లో కేటాయించిన నిధులు రజకుల అభివృద్ధికి ఖర్చు చేస్తామని చెప్పారన్నారు. ఆదరణ 3 ద్వారా రజకులకు పనిముట్లు అందజేస్తామని, 50 ఏళ్ల దాటిన ప్రతి రజక వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తామని హామీలు ఇచ్చారని, వారు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రజకుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అనంతరం చైతన్య తరగతుల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కమ్ ఇస్త్రీదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు, నాయకులు మాచవరం నరసింహారావు, యానాదిరావు, తాడేపల్లి సాంబశివరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

మంగళగిరి టౌన్: దేశ భవిష్యత్తుకు, వర్తమానానికి వారధులు బాలికలు అని నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి అన్నారు. ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా పథకంలోని జెండర్ ఈక్వాలిటీ క్లబ్, ఉమెన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని చేంజింగ్ మైండ్ సెట్స్ ఫ్రమ్ డిస్క్రిమినేషన్ టు ఎంపవర్‌మెంట్ అనే థీమ్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల జ్యోతి మాట్లాడుతూ ప్రతి బాలికకు విద్య, గౌరవం, స్వేచ్ఛ అందే సమాజం నిర్మించడం అందరి బాధ్యతన్నారు. బాలికలు ఉత్సాహంగా ముందుకు సాగాలన్నారు. థీమ్‌పై మాట్లాడిన పలువురు విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉమెన్ సెల్ కో ఆర్డినేటర్ రత్నమంజుల, ప్రిన్సిపాల్ డాక్టర్ పాముల రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్

మంగళగిరి టౌన్: దీపావళి సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలు, షాపులు, నిల్వలు చేసేవారు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని లేకుంటే పేలుడు పదార్థాల చట్టం కింద చర్యలు తప్పవని మంగళగిరి రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముడి సరుకులు తీసుకువచ్చి చాటుమాటుగా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. జనావాసాల మధ్య బాణసంచా గిడ్డంగులు ఏర్పాటు చేయొద్దని సూచించారు. వీలైనంత వరకు వ్యాపారులు విశాలమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా బాణసంచా వ్యాపారం నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

మేడికొండూరు: దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా బాణసంచా విక్రేతలు అనుమతులు తీసుకోవాలని మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్ సూచించారు. బాణసంచా అక్రమంగా విక్రయించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తాడేపల్లి రూరల్: పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఎం నిర్వహిస్తున్న అర్జీల కార్యక్రమాన్ని శనివారం తాడేపల్లి పట్టణంలోని లంబాడీపేట, మహానాడులోని కృష్ణానది ఒడ్డున నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సుందరయ్య నగర్ కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఇంత వరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని విమర్శించారు. నియోజకవర్గంలో 22 వేల మంది ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 17న అర్జీలు తీసుకుని మంగళగిరిలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్దరకు రావాలని పేదలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి, బాబూరావు, ఫిరోజ్, రామారావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న చెంగయ్య

మంగళగిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మున్సిపల్‌కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా నేత ఎస్.ఎస్. చెంగయ్య అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం రాత్రి ఎంటీఎంసీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రెండో మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఉన్న హక్కులను కాలరాస్తూ చట్టాలు తీసుకొస్తుందని, వాటికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికులు రూ.20 వేల వేతనం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో నేతలు దుర్గారావు, ఎం.రవి, జేవీ రాఘవులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



మేడికొండూరు: మేడికొండూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కె.జయప్రద శనివారం తెలిపారు. చెరువు జమ్ములపాలెంలో జరిగిన అండర్ 14 ఎస్‌జీఎఫ్ హాకీ ఎంపికల్లో భాగంగా మేడికొండూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈనెల 23న తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల నుంచి కె.దుర్గాగౌతమ్, వై.చైత్ర, సీహెచ్ అనూష, వై.జ్యోత్స్న, ఎం.దరహాస్, బి.ఐశ్వర్య పాల్గొంటారన్నారు. క్రీడాకారులను టి.వాణి, సునీల, కె.బాలకృష్ణను అభినందించారు.

పాఠశాల మైదానం మెరక



తాడేపల్లి రూరల్: కొలనుకొండ డీపీఈపీ ప్రాథమిక పాఠశాల మైదానాన్ని మెరక చేశారు. ఇక్కడ విద్యార్థులు ఆడుకోవడానికి వీలులేకపోవడంతో మంత్రి లోకేష్ మైదానాన్ని గ్రావెల్‌తో మెరక చేయించారని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రేపూడి బ్రాంచ్ (08294), రేపూడి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522529

స్వాధీనత ప్రకటన

(APPENDIX-IV) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002

రూల్ 8(1) ననుసరించి (స్థిరాస్తి కొరకు)

[illegible] తేది.21.07.2025 నాటి ABL A/c No.38288275873 కు రూ.7,10,991/- [illegible] తేది.24.07.2025 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

[illegible] 06.10.2025 న లాంఛనప్రాయంగా స్వాధీనత తీసుకోవడమైనది. [illegible]

[illegible] తేది.24.07.2025 నాటికి రూ.7,10,991/- [illegible] స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రేపూడి బ్రాంచ్, రేపూడి, గుంటూరు జిల్లా [illegible]

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, ఫిరంగిపురం [illegible] నెం.1128/2011, తేది.13.05.2011 [illegible]

తేది : 06.10.2025 | సం/- అధీకృత అధికారి
ప్రదేశం : రేపూడి | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా